క్లుప్తంగా

నగరంలో వాహనాల తనిఖీ



కడప అంబేడ్కర్ సర్కిల్‌లో వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న చిన్నచౌక్ ఎస్‌ఐ

కడప అర్బన్: కడప నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో శనివారం సాయంత్రం ఆయా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైపాస్ సర్కిల్‌లో రిమ్స్ ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తాము బయటకు వచ్చేటప్పుడు ఆర్‌సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్, కాలుష్య నివారణ సర్టిఫికెట్లను తీసుకుని రావాలన్నారు.

ఉచిత విద్యాహక్కు గడువు పెంచాలి



డీఈఓ రాఘవ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత విద్యా హక్కును వినియోగించుకునేందుకు గడువును పెంచాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు కోరారు. ఈమేరకు శనివారం డీఈఓ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యకు సంబంధించిన వివరాలు సామాన్య, పేద ప్రజలకు అర్థంకాని పరిస్థితి ఉన్నందున గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు శివశంకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏఎఫ్‌యూలో ఒంటిపూట తరగతులు

ఏఎఫ్‌యూ : కడప నగర పరిధిలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈనెల 3వ తేదీ సోమవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిపాలన విభాగం 10 నుంచి 5 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్



హల్‌చల్ చేస్తున్న యువకుడిని తీసుకుని వెళుతున్న పోలీసులు

కడప అర్బన్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం రాత్రి ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. ఈ సంఘటనను గుర్తించిన వాహనదారులు, స్థానికులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు.

యువతిని వేధించిన యువకుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గతనెల 31న రాత్రి ఓ యువతిని వేధించిన అనిల్ అనే యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన జరిగిన రోజు స్థానికులు ఆ యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతనిపై శనివారం కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

నోట్లరద్దు ముసుగులో ప్రైవేటీకరణ

కమలాపురం : బీజేపీ ప్రభుత్వం నగదీకరణ ముసుగులో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ విశాఖలో నిరసన దీక్షలు చేపట్టి 700 రోజులు పూర్తి అయిన నేపథ్యంలో శనివారం కమలాపురంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన 'ప్రజల ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్‌లకు ధారాదత్తం చేయడమే మోనిటైజేషన్' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం నగదీకరణ ముసుగులో ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని మండి పడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విదేశీ కంపెనీలకు విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని నిరసిస్తూ ఈనెల 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై తమ నిరసనను తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, భారతి, వెంకటేశ్వరమ్మ, కమల బీబీ, రమాదేవి, రాజేష్ పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమానికి ప్రాధాన్యత

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప అర్బన్ : ఖైదీలకు మెరుగైన వైద్య సదుపాయాలతో పాటు, సౌకర్యాలను అందించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో కడప కేంద్రకారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులలో జడ్జి మాట్లాడుతూ మానసిక వ్యాధులతో ఉన్న ఖైదీలకు సరైన వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది మహిళా ఖైదీలకు ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్‌బాబు, ప్రత్యేక మహిళా కేంద్ర కారాగారం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణవేణి, పారా లీగల్ వలంటీర్ సురేష్ సహాయం, దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ ఓబులదాసు, ఖైదీలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో అధిక పోషకాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాంతీయ సంచాలకులు పద్మజ

చెన్నూరు : చిరుధాన్యాలలో అధిక పోషకాలు ఉండటం వల్ల వీటిని గర్భిణులు, బాలింతలు తీసుకున్నట్లయితే రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారని, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాంతీయ ఉప సంచాలకులు పద్మజ తెలిపారు. చిరుధాన్యాలు-పోషణ్ పక్వాడలో భాగంగా శనివారం స్త్రీ శక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల గురించి, వాటి ప్రాముఖ్యతను గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలు ఫాస్ట్‌ఫుడ్ పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దీని ద్వారా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కొన్ని సార్లు ప్రాణాపాయస్థితి కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ, కడప మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, సీడీపీఓ ప్రభావతి, ఏపీఎం గంగాధర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఐఐటీ రూర్కీ ఆక్సెంటరీ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సునీల్ పేర్కొన్నారు. శనివారం కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టెక్ వేద టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతైన సాంకేతిక ఒరవడిని విద్యార్థులు తమ పరిశోధనలో ఉపయోగించుకునే విధంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, సిస్కో కంపెనీ సీనియర్ టెక్‌లీడ్ శివశంకర్, కొలినోస్పేస్ కంపెనీ సీనియర్ ఇంజినీరు రవితేజతో పాటు ఈసీఈ విభాగాధిపతి ప్రసాద్‌రెడ్డి, సీఎస్‌సీ విభాగాధిపతి చరిస్మా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' పాలకేంద్రం ప్రారంభం



'స్పందన' పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని వై జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్పందన' పాలకేంద్రాన్ని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ కె. సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పాలకేంద్రాన్ని ఏర్పాటు చేసిన శంకవరం నరసయ్య యాదవ్, నరసింహాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, బంగారు నాగయ్య యాదవ్, ఆర్‌వీ రమణ, షఫీవుల్లా, గంగరాజు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వం



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ విమర్శించారు. విశాఖ ఉక్కు ఉద్యమం చేపట్టి 700 రోజులు అయిన సందర్భంగా శనివారం నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోరుతూ 700 రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేటీకరణకు పూనుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థల ప్రయోజనమే ధ్యేయంగా పని చేస్తోందని స్పష్టమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, కేసీ బాదుల్లా, మద్దిలేటి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌డ్రైవ్‌లో 9 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌డ్రైవ్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 120 మంది విద్యార్థినులు పాల్గొనగా, 9 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. మోండెలజ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో టీం మెంబర్ ట్రైనీ ఉద్యోగాలకు నిర్వహించిన ఎంపికలకు విద్యార్థినులు హాజరుకాగా 9 మందిని ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో జేకేసీ ఫుల్‌టైం మెంటర్ పి. వరప్రసాద్, సి.వి. రవీంద్రారెడ్డి, కంపెనీ ప్రతినిధులు జి.ఎం.నటరాజ, మహేష్, కెరీర్ ట్రీ ప్రతినిధులు సౌందర్‌రాజన్, తిరుమురుగన్, హెచ్. నీరజన్ పాల్గొన్నారు.

డీడీ అచ్చన్న మృతికి కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పశు సంవర్ధకశాఖ డీడీ అచ్చన్న మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నాయకులు చంద్ర, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. డీడీ అచ్చన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని కోరుతూ శనివారం నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో అఖిలపక్ష పార్టీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించని పక్షంలో ఈ నెల 8న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు గురప్ప,కేసీ బాదుల్లా, బండి జకరయ్య, సత్తార్, అయ్యావారయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై బీజేపీ నాయకుల విమర్శలు దారుణం

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బీజేపీ నాయకులు సత్యకుమార్, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వాఖ్యలు దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 260 మంది రైతులను ప్రభుత్వమే బలి తీసుకుందని చెప్పడం సరికాదన్నారు. అమరావతి ప్రాంతాన్ని తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వేదికగా చేసుకొని మిగిలిన ప్రాంతాలను అప్పటి సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేశారని, తద్వారా ఆ ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత తన మనుగడ కోసం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు అమరావతి రైతుల ముసుగులో బినామీలను ఉసిగొల్పి వారిని బలి తీసుకున్నది చంద్రబాబేనన్నారు. ఇప్పటికైనా ఇలాంటి నీచ రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

బండలాగుడు పోటీలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఏరువాక గంగమ్మతల్లి గంగజాతర సందర్భంగా పోటీలు నిర్వహించారు. అలాగే గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

ఆర్టీపీపీలో ఉద్యోగుల ఆందోళన

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇతర సిబ్బంది తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ చేస్తున్న నిరసన శనివారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ అకౌంట్‌లో విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరవుతుండేవారు. అయితే ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉదయం 9 గంటలకే విధులకు హాజరుకావాలని ఏపీ జెన్‌కో ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేస్తూ నిరసన బాట పట్టారన్నారు.

నేడు గంగమ్మ జాతర

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆదివారం, సోమవారం గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు జాతర క మిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 2 గంటలకు గంగమ్మ ప్రతిమను గ్రామ నడిబొడ్డున ప్రతిష్ఠించి పూజలు చేస్తారని అలాగే ఉద యం 6 గంటలకు నడివీధి గంగమ్మకు మొదటి బోనం, 10 గంటలకు రెండవ బోనం సమర్పిస్తారని, 3 గంటలకు బోగాదమ్మకు బోనం సమర్పిస్తారన్నారు. సోమవారం ఉదయం 3 గంటల నుంచి 5 గంటలలోపు నల్లనమ్మ, మారెమ్మ, అంకాలమ్మతల్లికి బోనాలు సమర్పించి అనంతరం గ్రామోత్సవంగా తీసుకెళ్లి గ్రామ పొలిమేర వద్ద విడిచి రావడంతో జాతర ముగుస్తుందన్నారు.

ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలి

పులివెందుల రూరల్ : చదువులో ఉన్నతంగా రాణించి పది మందికి ఉపాధి కల్పించేస్థాయికి చేరుకోవాలని అనంతపురం జెఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జి.రంగజనార్దన్ తెలిపారు. శనివారం పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ వసుంధర ఆధ్వర్యంలో 17వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ రంగజనార్దన్ మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారా ఎంత స్థాయికైనా ఎదగవచ్చునన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో జరిగే సాంకేతికపరమైన మార్పులకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో కారుణ్య నియామకానికి ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగులంతా రుణపడి ఉంటారని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్, ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, రాజశేఖర్, ఎస్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ శివారెడ్డిలు తెలిపారు.

నిర్మాణ పనులను వేగవంతం చేయండి

పులివెందుల టౌన్ : షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ని పాత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. షాపింగ్ కాంప్లెక్స్ గదుల నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహించారు. 45వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని జరిపారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రికి సీతారాముల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉన్నత శిఖరాలకు

జిల్లా అటవీశాఖ అధికారి పీవీ సందీప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి పీవీ సందీప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా అటవీశాఖ అధికారి పీవీ సందీప్‌రెడ్డి సూచించారు. కడప నగర శివార్లలోని ఊటుకూరు అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కరస్పాండెంట్ చొప్పా గంగిరెడ్డి ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవాన్ని ర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఎవరైతే క్రమశిక్షణతో ఉంటూ పెద్దలపట్ల గౌరవం , సమాజం పట్ల అంకితభావం కలిగి ఉంటారో వారే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. ఆత్మవిశ్వాసం ఎంత ముఖ్యమో క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడితో కూడిన చదువులకు స్వస్తి పలికి విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిలో టమాట రూ.6

కిలో రూ.25 నుంచి రూ.6కు తగ్గిన వైనం



రైతు బజార్‌కు చేరిన టమాటలు

కడప అగ్రికల్చర్: రైతు బజార్‌లో టమాటల ధర బాగా తగ్గింది. మొన్న మొన్నటి దాకా కిలో రూ. 25 వరకు టమాట ధర ఉండేది. ఆ తరువాత కిలో రూ. 20, 15, 12 రూపాయలు ఇలా ధర తగ్గుతూ వచ్చింది. అయితే శనివారం రైతు బజార్‌లో కిలో టమాటల ధర కేవలం రూ. 6 పలికింది. దీంతో వినియోగదారులు అధిక మోతాదులో తీసుకుని వెళ్లారు. గతంలో టమాటలు మదనపల్లె, చింతామణి ప్రాంతాల నుంచి రావడంతో ధరలు అధికంగా ఉండేవని మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని సీకేదిన్నె, వల్లూరు, పెండిమర్రి, వేంపల్లి, వేముల, మైదుకూరు ప్రాంతాల నుంచి టమాటలు వస్తుండటంతో ధరలు బాగా తగ్గాయని వారు చెబుతున్నారు. కాగా టమాటల ధర తగ్గడంతో రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని కొంతనష్టం వాటిల్లక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ



పాఠశాల హెచ్‌ఎం, పీడీకి క్రీడాసామగ్రి అందజేస్తున్న శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ఆర్‌ఎం

కడప స్పోర్ట్స్/చెన్నూరు : చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడావిభాగానికి రూ.1.25 లక్షల విలువచేసే క్రీడాసామగ్రిని వితరణగా అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ సంస్థ రీజినల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాఠశాల హెచ్‌ఎం ఓ. రఘునాథరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కె. రెడ్డయ్యకు క్రీడాసామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రఘునాథరెడ్డి, పీడీ రెడ్డయ్యలు మాట్లాడతూ 40 జతల క్రీడాదుస్తులు, వాలీబాల్ నెట్స్, ఐరన్‌పోల్స్, నెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్ కిట్, వెయిట్‌లిఫ్టింగ్, కోలాటం తదితర సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం రామాంజనేయపురంలోని ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, ఆత్మ విశ్వాసం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివే బదులు ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఏపీఓ రజనీకాంతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవచ్చు



రక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

కమలాపురం : భూ కంపాలు, వరదలు లాంటి విపత్తులు సంభవించినప్పుడు కొంత మేరకు అవగాహన కలిగి ఉంటే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని విజయవాడలోని 10వ పటలం టీమ్ కమాండర్ శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సచివాలయ, రెవెన్యూ, ఆశా వర్కర్లకు విపత్తులను ఎదుర్కోవడంలో ఒక రోజు శిక్షణలో భాగంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలను డెమో ద్వారా చేసి చూపించారు. అలాగే హార్ట్‌ఎటాక్‌కు గురైనప్పుడు కూడా వారికి సీపీఆర్ అందించవచ్చన్నారు. విపత్తులు సంభవించినపుడు డిపార్ట్‌మెంట్ కొన్ని వస్తువులు ఇస్తుందని, అవి లేనప్పుడు కూడా కొన్ని వస్తువులను తయారు చేసుకోవచ్చన్నారు. ఖాళీ నీళ్ల బాటిళ్లను, ఎండు టెంకాయలు, ప్లాస్టిక్ వస్తువులను తాడుతో కట్టి నడుము చుట్టూ కట్టుకుని నీటిలో దిగి బాధితులను రక్షించవచ్చన్నారు. ఆపద సమయాల్లో క్షతగాత్రులను రక్షించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రామకృష్ణ, సందీప్, లక్ష్మయ్య, సత్యరాజ్, జీవ, జడేజా, ఎంపీడీఓ చలపతి, డీటీ ఇస్మాయిల్, ఆర్‌ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. చూతము రారండి

కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం వేణుగానం అలంకారణలో దర్శనమిచ్చిన స్వామి వారు, సాయంత్రం హంస వాహనంపై మాఢ వీధులలో విహరించారు. స్వామి వారి వాహన సేవలకు ముందు ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రామచంద్రుడి వాహనసేవలను చూసి తరించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

– ఒంటిమిట్ట



ఊంజల్ సేవలో సేదతీరుతున్న ఉత్సవమూర్తులు



మంగళవాయిద్యాలను వాయిస్తున్న దృశ్యం



కోలాటమాడుతున్న చిన్నారుల బృందం